క్లుప్తంగా

కాగజ్‌నగర్ ఆర్డీవోగా కె.సురేశ్ నియామకం

కాగజ్‌నగర్‌టౌన్: కాగజ్‌నగర్ రెవెన్యూ డివిజన్ ఆఫీసర్ (ఆర్డీవో)గా కె.సురేశ్‌ను నియమిస్తూ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. బెల్లంపల్లి ఆర్డీవోగా సేవలు అందిస్తున్న సురేశ్‌ను కాగజ్‌నగర్‌కు బదిలీ చేశారు.

మాదిగల మహాసభను జయప్రదం చేయాలి

కాగజ్‌నగర్‌టౌన్: హైదరాబాద్‌లోని పరేడ్ గ్రౌండ్‌లో ఈనెల 11న నిర్వహించ తలపెట్టిన మాదిగల విశ్వరూప మహాసభను జయప్రదం చేయడానికి సిర్పూర్ నియోజకవర్గంలోని ఆయా ప్రాంతాల నుంచి ఎమ్మార్పీఎస్ శ్రేణులు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి చంద్రగిరి సుదర్శన్ మాదిగ పిలుపునిచ్చారు. శుక్రవారం స్థానికంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మహాసభకు ముఖ్య అతిథిగా దేశ ప్రధాని నరేంద్ర మోదీతో పాటు మందకృష్ణ మాదిగ పాల్గొని ప్రసంగిస్తారని ఆయన తెలిపారు.

బీజేపీ నాయకుల బైండోవర్

బెజ్జూర్: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయంలో ఆర్‌ఐ అచ్యుత్ రావు ఎదుట ఎస్సై విక్రమ్ ఆధ్వర్యంలో మండల స్థాయి బీజేపీ నాయకులు ఉమ్మెర బాలకృష్ణతో పాటు మరో 11 మందిని బైండోవర్ చేశారు. ఉమ్మెర బాలకృష్ణ మాట్లాడుతూ రానున్న అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా శాంతియుతంగా జరిగేలా బీజేపీ తరఫున సహకరిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఏఎస్సై మోహన్ నాయక్, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

పాడె మోసిన ఎమ్మెల్యే



పాడె మోస్తున్న ఎమ్మెల్యే కోనప్ప

చింతలమానెపల్లి: మండలంలోని అంబగట్టు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పంగిడి చీకటి అనారోగ్యంతో మృతి చెందగా శుక్రవారం ఆయన అంత్యక్రియలు నిర్వహించారు. హాజరైన ఎమ్మెల్యే కోనేరు కోనప్ప పంగిడి చీకటి పాడె మోశారు. అంత్యక్రియలు పూర్తయ్యే వరకు ఉండి బాధిత కుటుంబాన్ని ఓదార్చారు. ఆయనతో పాటు నాయకులు చాప్లె సుధాకర్, చందు, తుల్సిరాం తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా 'సీస్' పరీక్ష

కెరమెరి: మండలంలోని 22 పాఠశాలల్లో శుక్రవారం ప్రారంభించిన 'సీస్' (స్టేట్ ఎడ్యుకేషన్ అచీవ్‌మెంట్ సర్వే) పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. 3, 6, 9 తరగతుల విద్యార్థులు ఈ పరీక్ష రాశారు. మొత్తం 33 మంది ఫీల్డ్ ఇన్వెస్టిగేటర్లు విధులు నిర్వహించారు. ఆయా పాఠశాలలకు చెందిన 504 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు సీస్ కో ఆర్డినేటర్లు ఆడే ప్రకాశ్, చంద్రశేఖర్ తెలిపారు.

అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించొద్దు

కాగజ్‌నగర్‌రూరల్: అసాంఘిక శక్తులకు ఆశ్రయం కల్పించొద్దని డీఎస్పీ కరుణాకర్ సూచించారు. శుక్రవారం మండలంలోని దరిగాం గ్రామంలో గ్రామస్తులతో సమావేశం నిర్వహించారు. కాగజ్‌నగర్ రూరల్ సీఐ నాగరాజు, ఎస్సై సోనియా పాల్గొన్నారు.

పారిశుధ్యంపై అవగాహన

వాంకిడి: మండలంలోని గణేశ్‌పూర్, గోయెగాం గ్రామాల్లో శుక్రవారం వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో పారిశుధ్యంపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డ్రమ్ములు, పాత డబ్బాల్లోని నిల్వ నీటిని పారబోసి డ్రైడే నిర్వహించారు. గోయేగాం పాఠశాలలో విద్యార్థులకు వ్యక్తిగత పరిశుభ్రత, అంటువ్యాధులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వైద్య విస్తరణ అధికారి పెందూర్ రవిదాస్, హెల్త్ అసిస్టెంట్ భగవాన్‌దాస్, బ్రీడింగ్ చెక్కర్ చంద్రశేఖర్, ఆశ మస్కుబాయి, తదితరులు పాల్గొన్నారు.

విద్యా బలోపేతానికి కృషి చేయాలి

ఆసిఫాబాద్‌రూరల్: గిరిజన విద్యా బలోపేతం కోసం కృషి చేయాలని ఏసీఎంవో ఉద్ధవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో పీఎంఆర్సీ కార్యాలయంలో సీఆర్‌పీలకు సమీక్షా సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గిరిజన విద్యార్థుల విద్యా వికాసానికి ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు అల్పాహారం అందించాలని పేర్కొన్నారు. యూడైస్ నమోదు చేసి డ్రాప్ బాక్స్‌లో ఉన్న విద్యార్థుల వివరాలు సేకరించాలని తెలిపారు. కార్యక్రమంలో సీఆర్‌పీలు పాల్గొన్నారు.

సిలిండర్ డెలివరీలో చేతివాటం

- అదనంగా రూ.50 నుంచి రూ.80 వసూలు
- ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న ఏజెన్సీలు
- పట్టించుకోని అధికారులు



మోతుగూడలో గ్యాస్ సిలిండర్ డెలివరీ చేస్తున్న సిబ్బంది

ఆసిఫాబాద్‌రూరల్: జిల్లాలో వంట గ్యాస్ సిలిండర్ డెలివరీ చేసే సిబ్బంది ఆగడాలకు అడ్డూఅదుపు లేకుండా పోతోంది. రవాణా చార్జీల పేరుతో డెలివరీ బాయ్ వినియోగదారుల నుంచి సిలిండర్‌పై అదనంగా రూ. 50 నుంచి రూ.80 వసూలు చేస్తున్నారు. సిలిండర్ ధర సుమారు రూ.975 ఉంటే రూ. 1050 వరకు వసూలు చేస్తున్నారు. ఇలా జిల్లావ్యాప్తంగా రావాణా చార్జీల పేరుతో వినియోగదారుల నుంచి పెద్ద ఎత్తున అక్రమ వసూళ్లు జరుగుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికులు ఆరోపిస్తున్నారు.

అక్రమ వసూళ్లు..

గ్యాస్ రవాణాలకు గ్యాస్ గోదాం నుంచి 5 కిలోమీటర్ల లోపు ఒక్క రూపాయి కూడా చెల్లించవద్దని నిబంధనలు ఉన్నా వాటిని అమలు చేయడం లేదు. ఈ విషయం అధికారులకు తెలిసినా పట్టించుకోవడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. గ్యాస్ డెలివరీ బాయ్స్ చేసే చిల్లర దోపిడీని అదుపు చేసే వారు లేక ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సంబంధిత అధికారులు నెలవారీగా ఏజెన్సీ నిర్వాహకుల నుంచి మామూళ్లు తీసుకొని చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు విమర్శిస్తున్నారు. గ్యాస్ డెలివరీ సిబ్బంది అడిగిన డబ్బులు ఇస్తేనే సిలిండర్ డెలివరీ చేస్తున్నారు. లేదంటే గోదాంకి వెళ్లి సిలిండర్ తెచ్చుకోవాలని చెబుతున్నారు. దీంతో తప్పని పరిస్థితుల్లో వినియోగదారులు అదనంగా డబ్బులు చెల్లిస్తున్నారు.

నిబంధనలు ఇవి..

గ్యాస్ సిలిండర్ డెలివరీ కోసం 5 కిలోమీటర్ల వరకు ఎలాంటి రుసుము వసూలు చేయరాదు. 5 కిలోమీటర్ల నుంచి 10 కిలోమీటర్ల వరకు సిలిండర్‌పై రూ. 20లు, 15 కిలోమీటర్లు దాటితే రూ.30 తీసుకోవాలని ప్రభుత్వ నిబంధనలు ఉన్నాయి. అయితే ఎక్కడా ఈ నిబంధన అమలు కావడం లేదు. 2 కిలోమీటర్ల లోపు సిలిండర్లు డెలివరీ చేసినా ఒక్కో దానిపై కనీసం రూ.50 నుంచి రూ. 80 డెలివరీ చార్జీలు వసూలు చేస్తున్నారు.

తనిఖీలు లేకపోవడంతో..

జిల్లాలో మొత్తం 12 ఏజెన్సీలు ఉన్నాయి. వీటిలో 1,39,562 వినియోగదారులు ఉన్నారు. వీటిలో దీపం కనెక్షన్ 23,319, జనరల్ 59,371, సీఎస్ఆర్ 15,951 ,ఉజ్వలా 30,921 గ్యాస్ కనెక్షన్లు ఉన్నాయి. జిల్లా పౌర సరఫరాల శాఖ అధికారుల తనిఖీలు లేకపోవడంతో గ్యాస్ ఏజెన్సీలు ఇష్టం వచ్చినట్లు వ్యవహరిస్తున్నారని వినియోగదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధిక వసూళ్లపై ఫిర్యాదు చేస్తే సిలిండర్లు సక్రమంగా ఇవ్వరమోనని వినియోగదారులు భయపడుతున్నారు. 15 కిలోమీటర్ల లోపు వరకు సిలిండర్ డెలివరీ ఉచితంగా చేయాల్సి ఉన్నా జిల్లా కేంద్రంలోని సందీప్ నగర్, బాపు నగర్, బ్రహ్మస్‌వాడ, ఎన్‌జీవో కాలనీ, జన్కాపూర్, రాజంపేట్, టీఆర్‌నగర్‌లలో 2 కిలోమీటర్ల వ్యవధిలోనే డెలివరీ సిబ్బంది రవాణా పేరుతో అదనంగా రూ.50లు వసూలు చేస్తున్నారు.

రూ.1050 వసూలు



ఆసిఫాబాద్ నుంచి బూర్గుడ 5 కిలోమీటర్లు దూరంలో ఉంది. సిలిండర్ ధర రూ.975 ఉండగా బూర్గుడకు డెలివరీ చేస్తే రూ.1050 తీసుకుంటున్నారు. అడిగితే ఆసిఫాబాద్‌కు వెళ్లి సిలిండర్ తీసుకొమ్మని చెబుతున్నారు.

– సత్తయ్య, బూర్గుడ

అదనంగా వసూలు చేస్తున్నారు



జిల్లా కేంద్రంలోని బాపూనగర్ భారత్ గ్యాస్ గోదాం నుంచి 2 కిలోమీటర్లు కూడా లేదు. ఇంటికి డెలివరీ చేస్తే అదనంగా రూ. 50లు వసూలు చేస్తున్నారు. సిబ్బందిని అడిగితే «తీసుకుంటే తీసుకోండి.. లేదంటే లేదు» అని గద్దరిస్తున్నారు.

– అజయ్, బాపూనగర్

చర్యలు తీసుకోవాలి



జిల్లా కేంద్రంలో భారత్ ఏజెన్సీ నిర్వాహకులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. సిలిండర్ డెలివరీకి అదనంగా డబ్బులు వసూలు చేస్తున్నారు. సంబంధిత అధికారులు తనిఖీలు నిర్వహించాలి. అక్రమ వసూళ్లను అరికట్టాలి.

– రవి, ఎన్‌జీవో కాలనీ

ఆశీర్వదించండి.. అభివృద్ధి చేస్తా

- కాంగ్రెస్ ఎమ్మెల్యే అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్



మాట్లాడుతున్న శ్యాంనాయక్

కెరమెరి: ఓటర్లు ఆశీర్వదిస్తే ఆసిఫాబాద్ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేస్తానని కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి అజ్మీరా శ్యాంనాయక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని స్టార్ ఫంక్షన్ హాల్‌లో కార్యకర్తలకు నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పదేళ్ల పాలనలో లాభపడింది కేవలం కేసీఆర్ కుటుంబం మాత్రమేనన్నారు. ఉద్యోగాలు లేక నిరుద్యోగులు కన్నీరు పెడుతుంటే కేసీఆర్ మాత్రం తన కుటుంబంలోని అందరికి ఉద్యోగాలు కల్పించాడని విమర్శించారు. ధరణితో చిన్న, సన్నకారు రైతులకు తీవ్ర అన్యాయం జరిగిందని పేర్కొన్నారు. ఆసిఫాబాద్ సమస్యలను 18 ఏళ్ల నుంచి చూస్తున్నానని, అందరికి సమన్యాయం జరగాలంటే కాంగ్రెస్ పార్టీకి ఓటేయాలని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు గుండా శ్యాం, నాయకులు కుసుంబ్‌రావు, ముఖీద్, సుదర్శన్, శంకర్ నాయక్, బాపూరావు, ఆత్రం లక్ష్మణ్, ఎల్లప్ప, రజ్జాక్, గిడ్డప్ప, రౌఫ్, మిలింద్, కూటికల వెంకటస్వామి, హన్మంతు, సాజిద్, శంశు తదితరులు ఉన్నారు.

రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీదే విజయం

వాంకిడి: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ భారీ మెజార్టీతో విజయం సాధించడం ఖాయమని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా నాయక్ ధీమా వ్యక్తం చేశారు. శుక్రవారం మండలంలోని ఖిరిడి, ఇందాని, పిప్పర్‌గొంది, చౌపన్‌గూడ, ఖానాపూర్, నగరి గుట్ట, కొలాంగూడ గ్రామాల్లో శ్యామ్‌నాయక్‌ను గెలిపించాలని కోరుతూ ప్రచారం సాగించారు. పార్టీ మండల అధ్యక్షుడు గుర్నులె నారాయణ, జిల్లా మహిళ నాయకురాలు రాథోడ్ రాజేంద్ర కుమారి, నాయకులు దేవాజీ, రామారావ్ పటేల్, గులాబ్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం'



పార్టీలోకి ఆహ్వానిస్తున్న పాల్వాయి హరీశ్‌బాబు

సిర్పూర్(టి): సిర్పూర్(టి) నియోజకవర్గం అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమవుతుందని నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి డాక్టర్ పాల్వాయి హరీశ్‌బాబు అన్నారు. శుక్రవారం మండలకేంద్రంలోని డొనల్ ప్రాంతంలో మాజీ ఎంపీటీసీ నేరెళ్ల లావణ్య, సహకార సంఘం డైరెక్టర్ నేరెళ్ల అశోక్‌తో పాటు పలువురు ఇతర పార్టీల కార్యకర్తలు బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా బీజేపీలో చేరిన కార్యకర్తలను, నాయకులను పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలోని సమస్యలను త్వరితగతిన పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. గ్రంథాలయ శాఖ డైరెక్టరు నీరటి సత్యనారాయణ, బీజేపీ నాయకులు దోని శ్రీశైలం, ఎల్ములే శంకర్, నులిగొండ మహేష్, మల్లికార్జున్ గౌడ్, మనోహర్‌గౌడ్, వడ్డేటి నాని, సాయి, ప్రశాంత్, శ్యాంరావ్, బాలు, రాచర్ల మహేష్, నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలోని బాబాసాగర్ గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం బీజేపీలో చేరారు. వారికి పాల్వాయి హరీశ్‌బాబు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీ గెలుపునకు కృషి చేయాలని ఆయన సూచించారు. నాయకులు మహేందర్ గౌడ్, తుకారాం పాల్గొన్నారు.

కౌటాల: డబుల్ ఇంజన్ సర్కార్‌తోనే సిర్పూర్ అభివృద్ధి సాధ్యమని బీజేపీ పార్టీ మండలాధ్యక్షుడు నారులే వానుపటేల్ అన్నారు. శుక్రవారం మండలంలోని తుమ్మిడిహెట్టి, జనగాం గ్రామాల్లో బీజేపీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వంతోనే గ్రామీణ ప్రాంతాలు అభివృద్ధి చెందుతున్నాయన్నారు. నాయకులు తిరుపతి, మృత్యుంజయ్, కవిరాజ్, మధుకర్, చందు, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

'అభ్యర్థులు సకాలంలో నామినేషన్లు వేయాలి'

సిర్పూర్(టి): అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ పత్రాలను అభ్యర్థులు సకాలంలో దాఖలు చేయాలని ఎన్నికల రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టరు దీపక్ తివారి సూచించారు. శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో అసెంబ్లీ ఎన్నికల నామినేషన్ ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈనెల 10వ తేదీలోపు ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు (ప్రభుత్వ సెలవులు మినహా) ఎన్నికల రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో రిటర్నింగ్ అధికారి లేదా సహాయ రిటర్నింగ్ అధికారికి నామినేషన్ పత్రాలు దాఖలు చేయవచ్చని తెలిపారు. ఈనెల 13న ఉదయం 11గంటలకు నామినేషన్ల పరిశీలన ఉంటుందని పేర్కొన్నారు. అభ్యర్థులు మొత్తం నాలుగు సెట్ల నామినేష్ పత్రాలు దాఖలు చేయవచ్చని, అత్యధికంగా రెండు ప్రాంతాల్లో పోటీ చేయవచ్చని తెలిపారు.

ఆసిఫాబాద్: అభ్యర్థులు నిర్ణీత సమయంలో నామినేషన్లు దాఖలు చేయాలని ఆసిఫాబాద్ రిటర్నింగ్ అధికారి, అదనపు కలెక్టర్ దాసరి వేణు ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు లేదా ప్రతిపాదకులు ఈ నెల 10వ తేదీలోపు ప్రభుత్వ పని దినాల్లో ఉదయం 11నుంచి మధ్యాహ్నం 3గంటల వరకు రిటర్నింగ్ అధికారికి నామినేషన్లు దాఖలు చేయాలని సూచించారు. 13న నామినేషన్ల పరిశీలన, 15న మధ్యాహ్నం 3గంటలలోపు ఉపసంహరణ ఉంటుందని తెలిపారు. ఈ నెల 30న ఉదయం 7నుంచి సాయంత్రం 4గంటల వరకు పోలింగ్ ఉంటుందని పేర్కొన్నారు. నామినేషన్ వేసే అభ్యర్థితో కలిపి ఐదుగురికి అనుమతి ఉంటుందని, మూడు వాహనాలను లోనికి అనుమతించనున్నట్లు తెలిపారు. ఒక్కో అభ్యర్థి నాలుగు సెట్ల నామినేషన్లు దాఖలు చేయవచ్చని, రెండు నియోజకవర్గాల్లో నామినేషన్ వేయవచ్చని తెలిపారు.

అద్దె వాహనాల కోసం దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన: బెల్లంపల్లి ఏరియాలోని వివిధ గనులు, డిపార్టుమెంట్లలో అద్దె ప్రతిపాదికన వాహనాలను ఏర్పాటు చేసేందుకు ఆసక్తి గల వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు శుక్రవారం బెల్లంపల్లి ఏరియా సింగరేణి యాజమాన్యం ఒక ప్రకటనలో తెలిపింది. వాహనాల టెండర్లలో భూ నిర్వాసితులకు మొదటి ప్రాధాన్యత ఉంటుందని ఈనెల 9వ తేదీ సాయంత్రం 4గంటలలోపూ జీఎం కార్యాలయంలోని పర్చేజ్ డిపార్టుమెంట్‌లో అందజేయాలని సూచించింది.

ఆర్థిక సాయం

ఆసిఫాబాద్‌అర్బన్: ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన వాంకిడి శివాలయం అర్చకుడు సెలోటే అశోక్ కుటుంబానికి దూప దీప నైవేద్యం (డీడీఎన్) జిల్లా కమిటీ సభ్యులు శుక్రవారం కాగజ్‌నగర్‌లోని వారి నివాసంలో రూ.11వేల ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా అశోక్ చిత్రపటానికి పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గంగు సత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు శిరీష్‌శర్మ, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసశర్మలు మాట్లాడుతూ అశోక్ కుటుంబానికి దేవాదాయ, ధర్మాదాయ శాఖ నుంచి రావాల్సిన బెనిఫిట్స్‌ను త్వరగా వచ్చేలా చూస్తామన్నారు. కార్యక్రమంలో కోశాధికారి నిమ్మకంటి సంతోష్‌శర్మ, సభ్యులు విజయ్‌కుమార్, మహేష్, సూర్యనారాయణ శర్మ, ప్రశాంత్ పాల్గొన్నారు.

బీఎస్పీ నాయకుల ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఎస్పీ నాయకులు

చింతలమానెపల్లి: మండల కేంద్రంలో శుక్రవారం బీఎస్పీ నాయకులు నీలాగౌడ్ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం చేపట్టారు. మేనిఫెస్టో కరపత్రాలు పంచుతూ బీఎస్పీని గెలిపించాలని కోరారు.

కౌటాలలో..

కౌటాల: బీఎస్పీతోనే బహుజనుల అభివృద్ధి సాధ్యమని బీఎస్పీ నియోజకవర్గ ఇన్‌చార్జి దుర్గం మోతిరాం అన్నారు. శుక్రవారం మండలంలోని బోదంపల్లి, గుండాయిపేట్, వీరవెల్లి గ్రామాల్లో పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సిర్పూర్‌లోని అరాచక పాలనను అంతం చేయడమే బీఎస్పీ లక్ష్యమన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

గుండి వాగుపై తాత్కాలిక వంతెన



తాత్కాలిక వంతెన నిర్మిస్తున్న గ్రామస్తులు

ఆసిఫాబాద్‌రూరల్: మండలంలో గుండి వాగుపై పైపులు వేసి తాత్కాలిక వంతెనను శుక్రవారం గ్రామ సర్పంచ్ జాబోరె రవీందర్ నిర్మించారు. వాగు నీటి ప్రవాహం తక్కువ కావడంతో పైపులు వేసి మట్టి పోశారు. ఉన్నతాధికారులు దృష్టి సారించి శాశ్వత వంతెన నిర్మాణం చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బీఆర్‌ఎస్ గూటికి సరస్వతి

- కోవ లక్ష్మి, ఆత్రం సక్కుతో కలిసి రాజధానికి
- నేడు పార్టీలో చేరిక

సాక్షి, ఆసిఫాబాద్: ఆసిఫాబాద్ నియోజకవర్గంలో రోజురోజుకూ రాజకీయాలు రసవత్తరంగా మారుతున్నాయి. నిన్నటి వరకు విపక్ష కాంగ్రెస్‌లో ఉంటూ కోవ లక్ష్మికి పోటీగా ఎన్నికల బరిలో నిలవాలని భావించిన మర్సుకోల సరస్వతి తిరిగి బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్ముకున్న తనకు టికెట్ దక్కకపోవడంతో ఆమె తీవ్ర నిరాశ చెందిన విషయం తెలిసిందే. పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి టిక్కెట్లు అమ్ముకున్నారనే ఆరోపణలు చేస్తూ పార్టీపై ఆమె నిప్పులు చెరిగారు. ఒక దశలో బీజేపీ వైపు మొగ్గుచూపిన ఆమె చివరకు మనసు మార్చుకున్నట్లు తెలుస్తోంది. శుక్రవారం రాత్రి సరస్వతి తన సోదరి జెడ్పీ చైర్‌పర్సన్, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కోవ లక్ష్మిని కలిసి పార్టీలో చేరేందుకు సుముఖత వ్యక్తం చేశారు. దీంతో హుటాహుటిన కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కులతో కలిసి సరస్వతి హైదరాబాద్ వెళ్లారు. గత సార్వత్రిక ఎన్నికల సమయంలో కూడా సరస్వతి కాంగ్రెస్ గూటి నుంచి అధికార పార్టీలో చేరారు. పార్టీ అధికారంలోకి వచ్చాక తనను జెడ్పీ చైర్‌పర్సన్ చేయాలన్న షరతును సరస్వతి పెట్టినట్లు సమాచారం. అధిష్టానం కూడా ఇందుకు సమ్మతించినట్లు తెలుస్తోంది. శనివారం బీఆర్‌ఎస్ అగ్రనేతల సమక్షంలో మర్సుకోల సరస్వతి పార్టీ కండువా కప్పుకోనున్నట్లు సమాచారం.

కోవ లక్ష్మిని భారీ మెజార్టీతో గెలిపించాలి



వాంకిడి: ప్రచారం చేస్తున్న నాయకులు

వాంకిడి: బీఆర్‌ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి, జెడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మిని అసెంబ్లీ ఎన్నికల్లో భారీ మెజార్టీతో గెలిపించాలని బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు, జెడ్పీటీసీ అజయ్ కుమార్ అన్నారు. శుక్రవారం మండలంలోని తేజాపూర్, ఘాట్, నగాం, నవెగూడ, ఖిరిడి గ్రామాల్లో ఎంపీపీ ముండె విమలబాయితో కలిసి ప్రచారం నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ జబోరె పెంటు, వాంకిడి సర్పంచ్ బండె తుకారాం, వైస్ ఎంపీపీ రాజ్‌కుమార్, ఎంపీటీసీ హిర్రె ప్రవీణ్ కుమార్ పాల్గొన్నారు.

ఆసిఫాబాద్: అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో బీఆర్‌ఎస్ అభ్యర్థి కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కుతో కలిసి ప్రచారం చేపట్టారు. కాలనీల్లో పార్టీ జెండాలు ఎగురవేశారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్ రావు, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

ఆసిఫాబాద్‌అర్బన్: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో ఆసిఫాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలో ఉన్న కోవ లక్ష్మిని ఆదివాసీలు ఐక్యంగా ఉంటూ గెలిపించాలని జిల్లా ఆదివాసీ భారత్ మహాసభ సెంట్రల్ కమిటీ నాయకుడు పెందూర్ రాజేశ్ కోరారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆదివాసీ మహిళకు టికెట్ కేటాయించకుండా అన్యాయం చేసిందన్నారు.

కెరమెరి: అభివృద్ధిలో తెలంగాణ రాష్ట్రం దేశంలోనే నంబర్‌వన్‌గా నిలిచిందని ఎంపీపీ పెందోర్ మోతిరాం, జెడ్పీటీసీ సెడ్మకి దుర్పతబాయి, వైస్ ఎంపీపీ అబ్దుల్ కలాం అన్నారు. శుక్రవారం మండలంలోని నిషాని, ఇందాపూర్, గోండ్‌గూడ, ఆగుర్‌వాడ, ఖైరీ, గ్రామపంచాయతీల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. ఉత్తం నాయక్, రఘునాథ్, సర్పంచ్ జగన్నాథ్‌రావు తదితరులు ఉన్నారు.

రెబ్బెన: బీఆర్‌ఎస్ గెలుపు కోసం పార్టీలోని ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఎంపీపీ జుమ్మిడి సౌందర్య, బీఆర్‌ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు పోటు శ్రీధర్‌రెడ్డిలు అన్నారు. శుక్రవారం మండలంలోని లక్ష్మీపూర్‌లో బీఆర్‌ఎస్ ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పీఏసీఎస్ చైర్మన్ సంజీవ్‌కుమార్, వైస్‌చైర్మన్ మహేష్‌గౌడ్, వైస్ ఎంపీపీ సత్యనారాయణ, మాజీ జెడ్పీటీసీ ప్రకాష్‌రావు, పాల్గొన్నారు.

నార్నూర్: సంక్షేమ పథకాలే బీఆర్‌ఎస్‌కు శ్రీరామరక్ష అని సిర్పూర్(యూ) జెడ్పీటీసీ కోవ అరుణ అన్నారు. శుక్రవారం మండలంలోని గణేశ్‌పూర్, భీంపూర్ గొండుగూడలో ఎమ్మెల్యే అభ్యర్థి కోవ లక్ష్మికి మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, బీఆర్‌ఎస్ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.

బీఆర్‌ఎస్ ఇంటింటి ప్రచారం



దహెగాం: ప్రచారం చేస్తున్న కోనేరు వంశీ

పెంచికల్‌పేట్: మండలంలోని మొట్లగూడ, ఎర్రగుట్ట గ్రామాల్లో జెడ్పీ వైస్‌చైర్మన్ కోనేరు కృష్ణారావు శుక్రవారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టో గ్రామస్తులకు వివరిస్తూ రానున్న ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటు వేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. మొట్లగూడ గ్రామానికి చెందిన పలువురు పార్టీలో చేరగా పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఆయన వెంట సర్పంచ్‌లు కళావతి, చంద్రమౌళి, శ్రీనివాస్, సంజీవ్, రాజన్న, ఎంపీటీసీ రాజన్న, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు తిరుపతి, నాయకులు సముద్రాల రాజన్న, చలం, రఘునాథ్, అశోక్ ఉన్నారు.

దహెగాం: సిర్పూర్(టి) నియోజకవర్గం నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థిగా కోనేరు కోనప్పను భారీ మెజార్టీతో గెలిపించాలని కోనేరు ట్రస్టు అధ్యక్షుడు కోనేరు వంశీ ఓటర్లను కోరారు. శుక్రవారం మండలంలోని బామానగర్ గ్రామంలో గడపగడపకు ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రవేశపెట్టిన మేనిఫెస్టోను ఓటర్లకు వివరించారు. మండల రైతుబంధు సమితీ కన్వీనర్ సంతోష్‌గౌడ్, వైస్ ఎంపీపీ సురేశ్, నాయకులు పాపయ్య, దిలీప్, నగేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

చింతలమానెపల్లి: మండలంలో శుక్రవారం బీఆర్‌ఎస్ నాయకులు ప్రచారం నిర్వహించారు. ఖర్జెల్లి గ్రామంలో నాయకులు మేకల ప్రసాద్, ఉప్పులం మహేష్, జాడి ఆకాష్‌ల ఆధ్వర్యంలో ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు.

కౌటాల: బీఆర్‌ఎస్ సిర్పూర్ అభ్యర్థి కోనేరు కోనప్పను మరోసారి ప్రజలు ఆశీర్వదించాలని బీఆర్‌ఎస్ నాయకులు శుక్రవారం మండలంలోని ముత్తంపేట్, గురుడుపేట్, కౌటాల గ్రామాల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పార్టీ మండలాధ్యక్షుడు ఆదే వసంత్‌రావు, సర్పంచ్ మౌనిశ్, కోఆప్షన్ సభ్యులు అజ్మత్, పార్టీ మండల యూత్ అధ్యక్షులు రవీందర్‌గౌడ్, రైతుబంధు సమితి మండల కన్వీనర్ మెర్పల్లి బ్రహ్మయ్య, మధుకర్, తిరుపతి, వెంకటేశ్, అశోక్, బాపు, గట్టయ్య, రమేశ్ పాల్గొన్నారు.

సూరు స్ఫూర్తితో పోరాడాలి



నినాదాలు చేస్తున్న నాయకులు

వాంకిడి: ఆదివాసీల హక్కుల సాధనలో తన జీవితాన్ని ధారబోసిన కుంరం సూరును ఆదర్శంగా తీసుకుని ఐక్యతతో పోరాటాలు సాగించాలని కొలాం సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆత్రం భీంరావు సూచించారు. శుక్రవారం కుంరం సూరు వర్ధంతిని మండల కేంద్రంలోని కుంరం సూరు భవన్ వద్ద ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సూరు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం భీంరావు మాట్లాడుతూ.. హక్కుల సాధనలో ప్రతి ఒక్కరూ ఐక్యతతో ఉద్యమించాలని పిలుపునిచ్చారు. ఆదివాసీ కొలాం వర్గీయులు అన్ని రంగాల్లో రాణించాలని, రాజకీయాల్లోనూ అడుగులు వేసి పాలకులుగా ఎదగాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కొలాం సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు సీడం అన్నిగా, జిల్లా ఉపాధ్యక్షుడు ఆత్రం జల్పత్‌రావు, నాయకులు కుంరం భీంరావు, భగ్వంత్‌రావు, ఆత్రం మారుతి, తుకారాం, నాగోరావు తదితరులున్నారు.

క్రీడల్లో గెలుపోటములు సహజం

కౌటాల: క్రీడల్లో గెలుపోటములు సహజమని బీఆర్‌ఎస్ పార్టీ మండల యూత్ అధ్యక్షుడు తాళ్లపల్లి రవీందర్‌గౌడ్ అన్నారు. కౌటాల యూత్ ఆధ్వర్యంలో కౌటాల మినీ స్టేడియంలో నిర్వహిస్తున్న ముద్రకోల్ల సురేశ్ మెమోరియల్ ఓపెన్ టు ఆల్ క్రికెట్ టోర్నమెంట్ పోటీలు శుక్రవారం ముగిశాయి. పోటీల్లో కాగజ్‌నగర్ జట్టుకు మొదటి బహుమతి రూ.25 వేలు, కౌటాల జట్టుకు ద్వితీయ బహుమతి రూ.15 వేల నగదుతో పాటు బహుమతులు అందజేశారు. కోఆప్షన్ సభ్యులు అజ్మత్, ఉప సర్పంచ్ తిరుపతి, నాయకులు డబ్బా బాపు, శ్రీనివాస్, నిర్వాహకులు డబ్బా గోపాల్, సాయి, ప్రణయ్, హరీశ్, దిలీప్, రాజు తదితరులు పాల్గొన్నారు.